RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | గురువారం 25 -6-2026 | సంచిక: 13 | సంఖ్య: 269 | పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి |
|---|---|---|---|---|---|---|




## జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభం..

- తొలి బంగారం రాష్ట్రంలోని జ్యుయలరీ సంస్థలకు అందించిన చంద్రబాబు
- కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గనుల ప్రాజెక్టు ప్రారంభం
- ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తొలి బంగారాన్ని రాష్ట్రంలోని జ్యుయలరీ సంస్థలకు అందజేత
- ఏపీలో ఉత్పత్తి అయ్యే బంగారం ఇక్కడే విక్రయిస్తామన్న జియోమైసూర్
- స్థానిక యువతకు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సీఎం

కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గనుల ప్రాజెక్టు బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును ప్రారంభించి, ఇక్కడ ఉత్పత్తి అయిన తొలి బంగారాన్ని రాష్ట్రంలోని జ్యుయలరీ సంస్థలకు అందించారు. మన రాష్ట్రంలో వెలికితీసిన వనరుల ప్రయోజనాలు మన రాష్ట్రంలోని వారికే దక్కాలనే లక్ష్యంతో



2లో

## 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..

### నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక
- నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిల మార్పు తప్పదని స్పష్టం
- పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
- పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## తెలంగాణలో హిట్లర్ పాలన

### ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- తెలంగాణలో హిట్లర్ తరహా పాలన సాగుతోందన్న హరీశ్ రావు
- ఖమ్మంలో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోందని ఆరోపణ
- మంత్రి పొంగులేటి ల్యాండ్ గ్రాబర్‌గా మారారంటూ తీవ్ర విమర్శ
- రైతు ఆశీర్వాద సభను క్షమాపణ సభగా మార్చాలని డిమాండ్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హిట్లర్ తరహా పాలన సాగిస్తోందని, ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తూ దమనకాండకు పాల్పడుతోందని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేదలకు





2లో

### రాయదుర్గం భూముల వివాదానికి ముగింపు..

## వెనక్కి తగ్గిన ఎస్‌బీఐ?

- పరిష్కారం దిశగా రాయదుర్గం భూవివాదం
- హైకోర్టు పిటిషన్ ఉపసంహరణకు ఎస్‌బీఐ సుముఖత?
- ప్రత్యామ్నాయ 2.5 ఎకరాల భూమికి అంగీకారం
- టీజీఐఐసీ, ఎస్‌బీఐ మధ్య మరో విడత చర్చలు
- ఎస్‌బీఐతో ప్రభుత్వ లావాదేవీల పునరుద్ధరణకు నిర్ణయం
- హైకోర్టు విచారణ అనంతరం అధికారిక ప్రకటనకు అవకాశం

## ఓటరు వివరాల సేకరణ నేటి నుంచి షురూ

- ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయనున్న బీఎల్ఓలు
- జూలై 24లోగా నింపిన ఫారాలను తిరిగి సమర్పించాలి
- అప్పుడే జూలై 31న ప్రచురించే ముసాయిదా జాబితాలో చోటు
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు/దరఖాస్తుల స్వీకరణ
- ఆన్‌లైన్‌లో సైతం ఎన్యూమరేషన్‌కు అవకాశం





2లో

## కొందరు రిలాక్స్ అవుతున్నారు...

- అది కోవిడ్ కన్నా ప్రమాదకరం: నారా లోకేశ్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని కేడర్‌కు లోకేశ్ పిలుపు
- అధికారంలోకి వచ్చాక రిలాక్స్ అవ్వడం కోవిడ్ కన్నా ప్రమాదకరమన్న లోకేశ్
- 'రెడ్ బుక్' తన పని తాను చేస్తుందని, ఎవరికీ అనుమానాలు అవసరం లేదని స్పష్టీకరణ
- సర్వే ప్రక్రియ కారణంగా ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం జులై 10కి వాయిదా
- కూటమి బంధం దీర్ఘకాలం కొనసాగుతుందని, అంతా కూటమి ధర్మానికి కట్టుబడాలని సూచన

### భూమయ్యగారిపల్లెలో వైఎస్ జగన్‌పై

## వెల్లువెత్తిన అభిమానం

### గ్రామస్తుల ఇష్టదైవ సన్నిధిలో ప్రత్యేక పూజలు

- గజమాలతో ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు
- వృద్ధుల ఆప్యాయత, చిన్నారులకు నామకరణం.. అక్షరాభ్యాసం
- తిరుగు ప్రయాణంలో కాన్వాయ్ ఆపి అంబులెన్స్‌కు దారి
- రాబోయేది మన ప్రభుత్వమే అంటూ పార్టీ శ్రేణులకు భరోసా
- భావోద్వేగాలు, ప్రజా ప్రేమకు నిదర్శనంగా నిలిచిన పర్యటన

కడప: వైఎస్సార్ కడప జిల్లా భూమయ్యగారిపల్లెలో అభిమాన జనం పోటెత్తారు. తమ ఇష్ట దైవం గట్టు శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ప్రారంబోత్సవంలో అభిమాన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటున్నారనే విషయం తెలుసుకొని ప్రజలు భారీగా తరలివచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్



2లో

## మాదక ద్రవ్యాలపై కన్నెర్ర

- ఈ నెల 26న అమిత్‌షా అధ్యక్షతన నార్కో--కోఆర్డినేషన్ సమావేశం
- హాజరు కానున్న 44 మంత్రిత్వ శాఖలు, అన్ని రాష్ట్రాల అధికారులు

న్యూఢిల్లీ: దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంలో భాగంగా కేంద్ర ప్రభు త్వం మరిన్ని కఠిన చర్యలకు శ్రీకారం చుడుతోంది.



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభం..

ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా, తొలి విడత బంగారాన్ని వాసవీ జ్యూయలర్స్, సాయి సంతోష్ జ్యూయలర్స్, మధుమూర్తి జ్యూయలర్స్, ఎమరాల్డ్ జ్యూయలర్స్ సంస్థలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా అందజేశారు. ఈ ప్రాజెక్టును నిర్వహిస్తున్న జియోమైసూర్ సంస్థ, ఇక్కడ వెలికితీసిన బంగారాన్ని రాష్ట్రంలోని వ్యాపారులకే విక్రయిస్తామని స్పష్టం చేసింది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూరేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమానికి ముందు, మైనింగ్ ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేందుకు మహిళలు, యువతకు శిక్షణ ఇచ్చే సిమ్యులేటర్ కేంద్రాన్ని సీఎం సందర్శించారు. అనంతరం, ఖనిజంతో కూడిన మట్టిని తరలించే భారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ ప్రాజెక్టుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# మాదక ద్రవ్యాలపై కన్నెర్ర

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన ఈనెల 26న ఢిల్లీలో నార్కో--కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) 10వ అత్యున్నత స్థాయి సమావేశం జరగనున్నట్లు ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) నిర్వహిస్తున్న ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 44 మంత్రిత్వ శాఖలు, విభాగాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, మాదకద్రవ్య నియంత్రణ సంస్థలకు చెందిన 108 మంది ప్రతినిధులు ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో పాల్గొంటారు.

**విజన్ డాక్యుమెంట్ విడుదల**

ఎన్‌సీఓఆర్‌డీ సమావేశ సందర్భంగా అమిత్ షా 'నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్ 2026--2029'ను విడుదల చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, మాదకద్రవ్య నిరోధక సంస్థలు, ఇతర భాగస్వాములతో విస్తృత సంప్రదింపుల అనంతరం ఈ పత్రాన్ని రూపొందించారు. మాదకద్రవ్యాల డిమాండ్ తగ్గింపు, సరఫరా నియంత్రణ, వ్యసన బాధితులకు పునరావాసం వంటి అంశాలకు సంబంధించిన సమగ్ర కార్యా చరణ ప్రణాళికను ఇందులో పొందుపరిచారు. ముఖ్యంగా సింథటిక్ డ్రగ్స్, డార్క్‌నెట్ ద్వారా జరిగే అక్రమ రవాణా, యువతను మాదకద్ర వ్యాలకు దూరంగా ఉంచడం, చికిత్సా, పునరావాస కేంద్రాల విస్తరణ వంటి అంశాలపై వచ్చే మూడు సంవత్సరాలకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. దేశవ్యాప్తంగా విధాన రూపకల్పన, అమలు, సంస్థాగత బలోపేతానికి ఈ విజన్ డాక్యుమెంట్ మార్గదర్శకంగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా అమిత్ షా 'ఎన్‌సీబీ వార్షిక నివేదిక--2025'ను కూడా విడుదల చేయనున్నారు. అలాగే జమ్మూ, గౌహతిలో నూతనంగా నిర్మించిన ఎన్‌సీబీ జోనల్ కార్యాలయాలను ప్రారంభించనున్నారు.

**రూ.6 వేల కోట్ల విలువైన డ్రగ్స్ ధ్వంసం**

దేశవ్యాప్తంగా డ్రగ్స్ నిర్మూలనకు చేపట్టిన ప్రత్యే క 'ఆన్‌లైన్ డ్రగ్ డిస్పోజల్ ఫోర్ట్‌నైట్ క్యాంపెయిన్'ను కూడా కేంద్ర హోంమంత్రి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 2,09,500 కిలోల మాదకద్రవ్యాలను ధ్వంసం చేయనున్నాయి. వీటి అంచనా విలువ 6 వేల కోట్లు అని ప్రభుత్వం తెలిపింది. దేశంలో మాద కద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై ఎన్‌సీఓఆర్‌డీ సమావేశంలో సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు, డ్రగ్స్ నియంత్రణ అమలు సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, రాబోయే మూడు సంవత్సరాల కార్యాచరణపై చర్చ జరగనుంది.

# భూమయ్యగారిపల్లెలో వైఎస్ జగన్‌పై వెల్లువెత్తిన అభిమానం



పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం పులివెందుల పర్యటనలో భాగంగా వేముల మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గట్టు శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రారంబోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వైఎస్ జగన్‌కు అర్చకులు వేద మంత్రాల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన జలాభిషేకం, కలశ స్థాపన, సుదర్శన హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాష్ట్ర ప్రజలందరికీ నరసింహ స్వామి దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని ప్రార్థించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులను, గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. అంతకు ముందు వేముల జెడ్పీటీసీ సభ్యుడు బయపురెడ్డి నేతృత్వంలో గ్రామస్తులు వైఎస్ జగన్‌కు భారీ గజ మాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వైఎస్ జగన్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన పార్టీ నేత ఓబుళరెడ్డి శ్రీరామిరెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీరామిరెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆ తర్వాత ఇదే గ్రామంలోని జెడ్పీటీసీ సభ్యుడు బయపురెడ్డి ఇంటికి వెళ్లి.. కాసేపు గడిపి యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

**ప్రజలతో మమేకం**

భూమయ్యగారి పల్లెలో 92 ఏళ్ల వృద్ధురాలు అన్నపూర్ణమ్మ వైఎస్ జగన్ వద్దకు వచ్చి బుగ్గలు తడిమి, తలపై చేతులు వేసి ఎంతో ఆప్యాయంగా ఆదరించింది. మరో వృద్ధురాలు తోటలో కోసుకొచ్చిన మల్లెపూలను వైఎస్ జగన్ చేతుల్లో పోసింది. అవే మల్లెపూలు తిరిగి ఆయన ఆమె వడిలో వేశారు. వైఎస్ జగన్ పట్ల వృద్ధులకు ఉన్న ప్రేమ, ఆప్యాయతలకు ఈ ఘటనలు నిదర్శనంగా నిలిచాయి. అనంతరం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మనవరాలు.. పల్లవి, నరేష్ దంపతుల కుమార్తెకు 'దైవిక'గా నామకరణం చేశారు. అంబకపల్లెకు చెందిన భాస్కరరెడ్డి, భార్గవి దంపతుల కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి చేయి పట్టుకొని పలక (స్లేట్)పై అక్షరాలు రాయించారు. పెండ్లిమర్రి మండలం పాతసంగటిపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగమల్లేశ్వరరెడ్డి అనారోగ్యం గురించి తెలుసుకున్న వైఎస్ జగన్.. ఆయన్ను ఫోన్‌లో పరామర్శించారు. భూమయ్యగారిపల్లె నుంచి పులివెందులకు తిరుగు ప్రయాణంలో తన కాన్వాయ్ వెనుక అంబులెన్సు వస్తుండటాన్ని గమనించి.. వెంటనే తన వాహన శ్రేణిని రోడ్డు పక్కన ఆపించి, అంబులెన్స్‌కు దారిచ్చారు.

# 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు.రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

# తెలంగాణలో హిట్లర్ పాలన

రక్షణగా నిలవాల్సింది పోయి, ల్యాండ్ గ్రాబర్‌గా వ్యవహరిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.రఘునాథపాలెంలో ఇళ్ల స్థలాల నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రఘునాథపాలెం పరిధిలోని సర్వే నంబర్ 218లో 625 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి, గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూర్చామని ఆయన గుర్తుచేశారు. నిరుపేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే, ప్రస్తుత ప్రభుత్వం జేసీబీలతో వాటిని కూల్చివేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన చింతకాని మండలంలో నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'ను 'రైతుల క్షమాపణ సభ'గా మార్చుకోవాలని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

# రాయదుర్గం భూముల వివాదానికి ముగింపు.. వెనక్కి తగ్గిన ఎస్‌బీఐ?

గత కొన్ని రోజులుగా తెలంగాణ ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మధ్య చర్చనీయాంశంగా మారిన రాయదుర్గం భూవివాదం పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇరు వర్గాల మధ్య జరిగిన వరుస చర్చల తర్వాత ఉద్రిక్తతలు తగ్గినట్లు సమాచారం. తాజాగా ఎస్‌బీఐ తీసుకున్న నిర్ణయాలతో ఈ వ్యవహారం త్వరలోనే ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎస్‌బీఐ సానుకూలంగా స్పందించింది. ఈ భూముల వ్యవహారానికి సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడానికి బ్యాంక్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో వివాదాస్పద భూమికి బదులుగా ప్రభుత్వం సూచించిన 2.5 ఎకరాల ప్రత్యామ్నాయ స్థలాన్ని స్వీకరించేందుకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) అధికారులు, ఎస్‌బీఐ ప్రతినిధుల మధ్య మరోసారి సమావేశం జరగనుంది. ఈ భేటీలో మిగిలిన అంశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. చర్చలు సానుకూలంగా ముగిస్తే భూ వివాదానికి పూర్తిస్థాయిలో తెరపడే అవకాశం ఉంది. ఇక ఈ వివాదం కారణంగా ఎస్‌బీఐపై తెలంగాణ ప్రభుత్వం గతంలో కఠిన వైఖరి అవలంబించింది. ప్రభుత్వ శాఖలకు చెందిన పలు లావాదేవీల విషయంలో పరిమితులు విధిస్తూ అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ వ్యవహారం రాజకీయ, ఆర్థిక వర్గాల్లో కూడా చర్చకు దారితీసింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎస్‌బీఐ వైఖరిలో మార్పు రావడంతో ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. బ్యాంక్‌తో కొనసాగుతున్న ప్రభుత్వ లావాదేవీలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రభుత్వ గ్రాంట్ల నిర్వహణతో పాటు ఎస్‌బీఐకి ఉన్న లీడ్ బ్యాంక్ హోదాను కూడా కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. హైకోర్టులో తదుపరి విచారణ పూర్తయిన తర్వాత ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అప్పటివరకు ఇరు పక్షాలు చర్చల ప్రక్రియను కొనసాగించే అవకాశముంది.

# కొందరు రిలాక్స్ అవుతున్నారు...

గొడ్డలి పార్టీ చేస్తున్న విష ప్రచారాన్ని, ఫేక్ వార్తలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని, అదే సమయంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి-సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విపక్షంలో ఉన్నప్పుడు ఎలా ఉన్నామో, ఇప్పుడూ అదే స్ఫూర్తితో ఉండాలని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా మోపిదేవిలో నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చాక కొందరు కార్యకర్తలు రిలాక్స్ అవుతున్నారని, ఇది కోవిడ్ కన్నా ప్రమాదకరమైన జబ్బు అని లోకేశ్ హెచ్చరించారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాడతాం, అధికారంలోకి రాగానే రిలాక్స్ అయిపోతాం. కష్టకాలాన్ని మర్చిపోకూడదు. చిన్న పొరపాటు జరిగినా అలిగి ఇంట్లో కూర్చోవడం వల్ల నష్టపోయేది టీడీపీ, ఆంధ్రప్రదేశ్ ప్రజలే" అని హితవు పలికారు. గొడ్డలి పార్టీ సృష్టించిన అడ్డంకులను అధిగమించి అధికారంలోకి వచ్చామని, ఈ స్ఫూర్తిని మరువొద్దని సూచించారు.

గత ప్రభుత్వంలో బూతుల మంత్రులు కృష్ణా జిల్లా పరువు తీశారని, కార్యకర్తలను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. "మహనీయులు పుట్టిన ఈ జిల్లాలో ఒక బూతుల మంత్రి, ఇంకొకరు కార్యకర్తలను వేధించేవారు. భువనేశ్వరమ్మ గారిని కూడా అవమానించారు. వారి పేర్లను ఎర్రబుక్కులో రాస్తున్నానని ఆనాడే చెప్పాను. రెడ్ బుక్ తన పని తాను చేస్తుంది, దానిపై ఎవరికీ అనుమానాలు అవసరం లేదు" అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని లోకేశ్ వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4,000 పింఛను, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం కింద 3 సిలిండర్లు, తల్లికి వందనం రెండో విడత వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,000 టీచర్ పోస్టులు, జాబ్ క్యాలెండర్ ద్వారా 10,000 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదని, ఆ పనులకే రూ.2,000 కోట్లు ఖర్చయిందని విమర్శించారు. వైసీపీ అబద్ధాన్ని కూడా నిజమని నమ్మించే ఫేక్ పార్టీ అని, వారి తప్పుడు ప్రచారాన్ని గ్రామ, మండల స్థాయిలో ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. "ఎస్ఐఆర్" ప్రక్రియ కొనసాగుతున్నందున 'ఇంటింటికీ ప్రచారం' కార్యక్రమాన్ని జులై 10వ తేదీ నుంచి ప్రారంభిస్తామని లోకేశ్ ప్రకటించారు. బీజేపీ-జనసేన-టీడీపీ కూటమి బంధం దీర్ఘకాలం కొనసాగుతుందని, "నో మిస్ ఫైర్, నో క్రాస్ ఫైర్, నో విడాకులు" అన్నదే తమ విధానమని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఇతర నేతలు పాల్గొన్నారు.

# నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు

## లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ,జూన్: నల్లగొండలో సిటీ బస్సు సేవలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆస్పత్రికి చేరుకోవడానికి ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై వారు సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. బుధవారం కోటి 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తొలుత 2 సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిటీ బస్సు సర్వీసులు చెరువుగట్టు-ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధర్వేశిపురం నుండి దుప్పలపల్లి వరకు నడిచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించడం జరిగిందని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

# ఓటరు వివరాల సేకరణ నేటి నుంచి షురూ

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)--2026లో భాగంగా గురువారం నుంచి రాష్ట్రంలోని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం..జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటా తిరిగి ప్రతి ఓటరుకు ఒక జత ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయనున్నారు. ఫారంపై సంబంధిత ఓటరు పేరు, ఎపిక్‌కార్డు సంఖ్య, చిరునామా, ఫొటో, తదితర పాక్షిక వివరాలు ముద్రించి ఉండనున్నాయి. మిగిలిన వివరాలతో రెండు ప్రతులను పూరించాక వాటిపై బీఎల్ఓ సంతకం చేసి ఒక ప్రతిని ఓటరుకే రశీదుగా ఇచ్చి మరో ప్రతిని తనతో పాటు తీసుకెళ్తారు. ఈ విధంగా ఓటర్లు వివరాలు భర్తీ చేసి తమ సంతకం/వేలి ముద్రతో జూలై 24 లోగా బీఎల్ఓలకు తిరిగి అప్పగిస్తేనే జూలై 31న ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు రానుంది.

**మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు..**

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, ప్రతి ఒక్క ఓటరుకు పంపిణీ చేసేందుకు జత ఎన్యూమరేషన్ ఫారాలను ఇప్పటికే ముద్రించి బీఎల్ఓలకు సరఫరా చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఆంగ్లంలో, మిగిలిన జిల్లాల్లో తెలుగులో ప్రచురించిన ఎన్యూమరేషన్ ఫారాన్ని ఓటర్లకు పంపిణీ చేయనున్నారు. ఓటరు స్థానికంగా అందుబాటులో లేకపోతే అతడి ఎన్యూమరేషన్ ఫారాన్ని కుటుంబ పెద్ద భర్తీ చేసి సంతకం పెట్టి బీఎల్ఓకు ఇవ్వవచ్చు. పోలింగ్ కేంద్రాల వారీగా సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 31న ప్రచురిస్తారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించడంలో విఫలమైన ఓటర్లను గైర్హాజరు/నివాసం మారడం/చనిపోయిన/డూప్లికేట్ ఓటర్లుగా పరిగణించి వారి పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. ఇలా తొలగించిన ఓటర్ల జాబితాలను సైతం పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురించి స్థానిక గ్రామ పంచాయతీ/వార్డు కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాల (ఫామ్--7)తో పాటు కొత్తగా ఓటర్లుగా నమోదు (ఫామ్--6), వివరాల దిద్దుబాటు/చిరునామా మార్పు (ఫామ్--8) కోసం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ముసాయిదా జాబితాలో పేరు రాకపోయినా లేదా అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన/నిండనున్న యువత ఓటర్లుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 మధ్యకాలంలో ఈ దరఖాస్తులు, అభ్యంతరాలను పరిష్కరించడంతో పాటు మ్యాపింగ్ సరిపోలని అనుమానిత ఓటర్లకు ఈఆర్ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్)లు నోటీసులు జారీ చేసి నిర్దిష్ట తేదీలో విచారణకు పిలుస్తారు.

**11 పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలి**

రాష్ట్రంలోని 3.38 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటివరకు 2.38 కోట్ల మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తికాగా, మ్యాపింగ్ జరిగిన ఓటర్లలో 89.98 లక్షల మంది ఓటర్ల వివరాల్లో తేడాలున్నట్టు గుర్తించారు. వీరందరూ విచారణకు హాజరై ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని సమర్పించి తమ పుట్టిన తేదీ/నివాస ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ జాబితాలో 12వ ధ్రువీకరణ పత్రంగా ఆధార్‌ను ఈసీ చేర్చినా, పుట్టిన తేదీ/నివాస ధ్రువీకరణ కోసం పరిగణనలోకి తీసుకోరు. కేవలం గుర్తింపునకు ధ్రువీకరణగానే ఆధార్‌ను స్వీకరించనున్నారు. ఈసీ నిర్దేశించిన పత్రాల్లో ఏ ఒక్క పత్రం లేని ఓటర్లు వారికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఇతర ధ్రువీకరణ పత్రాలను సైతం సమర్పించవచ్చు. అయితే వాటి స్వీకరణ పూర్తిగా ఈఆర్వోల విచక్షణాధికారాలపై ఆధారపడి ఉంటుంది. అభ్యంత నిర్ణయాలకు అనుగుణంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసి అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.



# డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తి

### వారం రోజులపాటు జైలు శిక్ష విధించిన కోర్టు

నిజామాబాద్: మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు ఏడు రోజుల సాధారణ కారాగార శిక్ష విధించిందని ఐదవ టౌన్ ఎస్సై సునీల్ వెల్లడించారు. స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన సమయంలో షేక్ హబీబ్ అనే వ్యక్తికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించగా అతడు మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లుగా నిర్ధారణ అయినట్లు ఎస్సై వివరించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి బుధవారం ప్రత్యేక జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా కోర్టు శిక్ష విధించిందని వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు సదరు నిందితుడిని నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు డ్రైవ్ చేయవద్దని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

# నిజామాబాద్‌లో అనూహ్యఘటన

### కస్టమర్‌లో వచ్చి కారుతో ఉడాయింపు

నిజామాబాద్: కారు కిరాయకు మాట్లాడుకున్న వ్యక్తి డ్రైవర్ దిగి అరటి పళ్లు తెచ్చేలోగా రారుతో ఉడాయించాడు. ఈ ఘటన నిజామాబాద్‌లో జరిగింది. రోడ్డు పక్కన కారు ఆపి అరటి పళ్లు తెచ్చేలోపే కారు మాయమైన సంఘటన నిజామాబాద్ పట్టణంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. కుద్రిత్ బేగ్ అనే వ్యక్తి కారు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి లాగే కిరాయి కోసం పట్టణంలోని చెన్నై షాపింగ్ మాల్ వద్దనున్న అడ్డా వద్ద కారును నిలిపాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వచ్చి నాందేడ్‌కు వెళ్లాలని కుద్రిత్ బేగ్ కారును రూ.4 వేలకు కిరాయికి కుదుర్చుకున్నాడు. కారు గాంధీ చౌక్ వద్దకు రాగానే సదరు కస్టమర్ అరటి పండ్లు తెమ్మని డ్రైవర్ కుద్రిత్ బేగ్‌ను కోరాడు. కారు పక్కకు ఆపి అరటి పండ్లు తీసుకుంటుండగా కిరాయి కుదుర్చుకున్న వ్యక్తి కారుతో పరారయ్యాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వర్షాకాలంలో పోలీసులకు ఆసరా

### రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన కమిషనర్

రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వర్షాకాలంలో విధి నిర్వహణకు ఉపయోగపడే రెయిన్‌కోట్లను కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎండనకా, వాననకా రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహించే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్‌కోట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విధి నిర్వహణ సమయం లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి సమర్ధవంతంగా బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్,మల్లేశం,రమేష్ పాల్గొన్నారు.

# గ్రామంలో రెచ్చిపోయిన వీధి కుక్కలు

ఆరుగురిపై దాడిచేసి గాయపరచడంతో ఆస్పత్రికి తరలింపు

జగిత్యాల,జూన్24(ఆర్‌ఎన్‌ఎ): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుడిసెల పేట గ్రామంలో బుధవారం పిచ్చికుక్కలు రెచ్చిపోయాయి. వీర విహారం చేసి ఆరుగురిని తీవ్రంగా గాయపరిచాయి. గుడిసెల నరసమ్మ ముఖంపై తీవ్రంగా గాయం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మరో ఐదుగురిని చాతిలో , తలకు, ముఖం, కాళ్లకు పై దాడి చేయగా గాయాలయ్యాయి. వీరందరినీ హుటాహుటినా అంబులెన్స్ లో జగిత్యాల ప్రభుత్వ దవఖానాకు తరలినీచి చికిత్స అందిస్తున్నారు.


# ఒకరికి ఒకే ఓటును అమలు చేయండి

### బోగస్ ఓట్లను మాత్రమే తొలగించాలి

### ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్‌ఎస్ వినతి

హైదరాబాద్: బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. ప్రత్యేక సవివర ఓటరు జాబితా సవరణపై ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తోపాటు బీఆర్‌ఎస్ నాయకుడు కురువ విజయ్ సీఈవో సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. 'ఒక వ్యక్తి ఒక ఓటు' సూత్రాన్ని కచ్చితంగా అమలు చేసి, ద్వంద్వ ఓటరు నమోదులను గుర్తించి తొలగించాలని బీఆర్‌ఎస్ నేతలు ఎన్నికల సంఘాన్ని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పునాదులను విధ్వంసం చేసేటటువంటిది.. రాజ్యాంగ స్ఫూర్తిని సర్వనాశనం చేసేటటువంటిది. పవిత్రమైన ఎన్నికల పక్రియను పూర్తిగా భ్రష్టు పట్టించే పక్రియ డూప్లికేట్ ఓటర్లు అని అన్నారు. ఈ బోగస్ ఓటర్లు, డూప్లికేట్‌ఓటర్ల వల్ల పవిత్రమైన ప్రజాస్వామ్య యుత ఎన్నికల పక్రియను సర్వనాశనం చేస్తున్నారో దాన్ని సరిదిద్దడం కోసమే మేం ముందుకొచ్చామని కేంద్ర ఎన్నికల సంఘం పలు మార్లు చెబుతూ ఎస్ఐఆర్ అనే పక్రియను మనముందుకు తీసుకొచ్చింది. కేసీఆర్, బీఆర్‌ఎస్, ఇతర రాజకీయ పార్టీలు ప్రజలంతా పెద్ద ఎత్తున ఈ ఎస్ఐఆర్ పక్రియలో భాగస్వామ్యులవుతున్నారు. అయితే దీంట్లో కొలిక్కిరాని అందరూ అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే.






# నేటి ప్రస్థానం కథనానికి స్పందించిన ఎంఈవో.. స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ

**మేడ్చల్, ప్రత్యేక ప్రతినిధి:** ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక సదుపాయాల కొరత, రేకుల షెడ్లలో తరగతుల నిర్వహణ, విద్యార్థుల భద్రతకు సంబంధించిన లోపాలు తదితర అంశాలపై నేటి ప్రస్థానం ప్రచురించిన ప్రత్యేక కథనానికి మేడ్చల్ మండల విద్యాధికారి (ఎంఈవో) స్పందించినట్లు సమాచారం. కథనంలో ప్రస్తావించిన అంశాలను సీరియస్‌గా పరిగణించిన ఎంఈవో, సంబంధిత పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. మూడు రోజుల్లోగా పూర్తి వివరణ సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం. వివరణ అనంతరం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల భద్రత, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ నిబంధనల అమలు వంటి అంశాలపై రాజీ పడబోమని అధికారులు సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. వివరణ సంతృప్తికరంగా లేకపోతే తదుపరి చర్యలుగా జరిమానాలు, గుర్తింపు రద్దు సిఫార్సులు లేదా ఇతర చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశముందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా, నోటీసులు జారీ చేయడమే కాకుండా సంబంధిత పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. కేవలం హెచ్చరికలతో సరిపెడతారా? లేక నిబంధనలు ఉల్లంఘించిన విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటారా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, అధికారులు నిర్ణయించిన గడువులోగా పాఠశాల యాజమాన్యాలు సమగ్ర వివరణ సమర్పిస్తాయా? లేదా విద్యాశాఖ మరింత కఠిన వైఖరి అవలంబిస్తుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది. నేటి ప్రస్థానం వెలుగులోకి తీసుకొచ్చిన అంశాలపై అధికారుల స్పందనతో విద్యా వర్గాల్లో ఆసక్తి నెలకొంది.


నేటి ప్రస్థానం
జనరల్ న్యూస్
బుధవారం 24-6-
3
ప్రైవేట్ పాఠశాలల ఆగడాలు.. పిల్లల భవిష్యత్తుతో వ్యాపారమా?
నిబంధనలు బేఖాతరు.. ఫీజుల దందా.. మౌలిక వసతులపై ప్రశ్నలు
విద్యాశాఖ పర్యవేక్షణ లోపమా..? లేక యాజమాన్యాల ఇష్టారాజ్యమా..?
విద్యాశాఖపై ప్రశ్నలు
ఫీజుల ...

# ఆర్జీయూకేటీలో విజయవంతంగా ఆన్ ఫిల్డ్ గ్లోబల్ సీట్ల అడ్మిషన్ ప్రక్రియ





### అంతర్జాతీయ ఉపాధి అవకాశాల గురించి దిశానిర్దేశం

### విద్యార్థుల తల్లిదండ్రులతో వీసీ గోవర్ధన్

**బాసర :** నిర్మల్ జిల్లా రాజీవ్ గాంధీ నాలెడ్జ్ టెక్నాలజీస్ విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) బాసర ట్రిబుల్ ఐటీలో అన్ ఫిల్లింగ్ గ్లోబల్ అడ్మిషన్ల ప్రక్రియ విజయవంతంగా కొనసాగింది. క్యాంపస్ లోని సాక్ బిల్డింగ్ ఆడిటోరియం లో నిర్వహించిన ఈ అడ్మిషన్ల కార్యక్రమానికి విద్యార్థు లు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యా రు. ఈ సందర్భంగా అడ్మిషన్ల ప్రక్రియను పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు దిశానిర్దేశం చేయడానికి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ ప్రత్యేకం గా ప్రసంగించారు. విశ్వవిద్యాలయంలో అమలవుతున్న విద్యా విధానం, భవిష్యత్తు ఆలోచనలు, అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాల గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. మారుతున్న సాంకేతిక కాలానికి అనుగు ణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుప రుచుకోవాలని,ఇక్కడి విద్యా వనరులను సద్వి ని యోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచిం చారు. అనంతరం ఓఎస్డీ ప్రొఫెసర్ ఇ. మురళీ దర్శన్ విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో గొప్పగా చదువుకొని సమాజం లో ఉన్నతమైనటువంటి పదవులను పొందినప్పుడే వారు చదివిన చదువుకు సార్ధకత చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. కన్నబిడ్డలు ఉన్నత స్థానాల్లో స్థిరపడినప్పుడే తల్లిదండ్రులకు సమాజంలో నిజమైన గౌరవం దక్కుతుందని పేర్కొంటూ, విద్యార్థులు తమ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఉన్నతాధికారుల ప్రసంగాల అనంతరం విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియ అధికారికంగా మొదలైంది. ఈ కార్యక్రమంలో అడ్మి షన్స్ కన్వీనర్ శేఖర్ శీలం,కో కన్వీనర్ బండి హరికృష్ణ, అడ్మిషన్స్ టీం మెంబెర్స్, ఇతర బోధన,బోధనేతర సిబ్బంది,వివిధ విభాగాల అధికారులు పాల్గొని అడ్మిషన్ల ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా కొనసాగించారు.

# పిప్రీ గ్రామానికి రూ.30 లక్షల నిధులు మంజూరు



### గోదాం నిర్మాణంతో రైతులకు ప్రయోజనం

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**లోకేశ్వరం,24 :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని పిప్రీ గ్రామ అభివృద్ధికి రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. గ్రామంలో నిర్మాణ పనుల కోసం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మంజూరు పత్రాన్ని గ్రామ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ గోదాం నిర్మాణం పూర్తయిన అనంతరం రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను భద్రంగా నిల్వ చేసుకునేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పంటలకు సరైన ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే సౌకర్యం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామస్తులు నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు.



# విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### ఏడు రకాల వరి వంగడాలనే సాగు చేయండి

### మండల వ్యవసాయ అధికారి రచన

ముధోల్, 24 జూన్ : నిర్మల్ జిల్లా ముధోల్ లో జరిగిన విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రచన అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30 తేదీ వరకు రైతు వేదికల్లో విత్తనాల మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో ఏడు రకాల వరి వంగడాలను మాత్రమే సాగు చేయాలని సూచించినందన్నారు. రైతులు మంచి డిమాండ్ ఉన్న వీటినే సాగు చేయాలన్నారు. సోయ,కందులు, వేరుసెనగ, కూరగాయలు, తదితర పంటలు సాగు చేయాలని సూచించారు.



## తినుబండారాల దుకాణదారులంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

### పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారి.... టి. సునీత

### గడువు ముగిసిన, లేబుళ్లు లేని ఆహార పదార్థాల గుర్తింపు

**నిర్మల్ జిల్లా, జూన్ 24:** జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దాడులలో పలు దుకాణాలలో గడువు తీరిన మిఠాయిలు, చాక్లెట్లు, లేబుళ్లు లేని ఆహార పదార్థాలను గుర్తించారు. ఆయా మిఠాయి దుకాణాలపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. దుకాణదారులంతా ఆహార పదార్థాలకు సంబంధించి లేబుళ్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహార పదార్థాల గడువు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ, గడువు తీరిన ఆహార పదార్థాలను దుకాణాల నుంచి తొలగించాలని తెలిపారు.

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దిశా కమిటీ సమావేశం

### అధికారులపై ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం

### ప్రోటోకాల్ ఉల్లంఘన చేసిన జిన్నారం మున్సిపల్ కమిషనర్‌పై ఎంపీ రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం




**సంగారెడ్డి, జూన్ 24:** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు అధ్యక్షత వహించారు.సమావేశంలో సురేష్ షెట్కర్, మాణిక్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిన్నారం మున్సిపల్ కమిషనర్ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. ప్రోటోకాల్ ఉల్లంఘించినందున తగు వివరణ కావాలని ఆదేశించడం జరిగింది, అలాగే అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఎంపీ ఆదేశించారు. సమావేశంలో పలు శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.

## తెలంగాణలో జనసేన జోరు...

### భారీ చేరికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన పవన్ కల్యాణ్

### తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టిన పవన్ కల్యాణ్

### తెలంగాణ జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

### క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన ఫోకస్ పెంచింది. తెలంగాణలో పార్టీ ఉనికిని చాటడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసేందుకు జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణ మొదలుపెట్టారు. రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, ఇతర పార్టీల నుండి వచ్చే వలసలను సమన్వయం చేయడానికి ఏడుగురు సభ్యులతో కూడిన 'తెలంగాణ జాయినింగ్స్ కమిటీ'ని అధికారికంగా నియమించారు. పార్టీ భావజాలానికి ఆకర్షితులవుతున్న విద్యావంతులు, సామాజికవేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు, తటస్థులను లైన్‌లోకి తెచ్చే బాధ్యతను ఈ ఏడుగురు సభ్యులకు అప్పగించారు.

గొట్టిముక్కల నరేష్ రెడ్డి అబ్దుల్ హనీఫ్, అల్లాడి తనీష్ (సినీ నటుడు), చిరాగ్ ప్రజీత్ గౌడ్, మేదూరి సరస్వతి (తెలంగాణ రాష్ట్ర మాజీ డీసీపీ), తెలంగాణ వ్యాప్తంగా వస్తున్న చేరికల విజ్ఞప్తులను ఈ జాయినింగ్స్ కమిటీ మొదట క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ తర్వాత ఆ రిపోర్టులను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి క్లియరెన్స్ చేసి, నేరుగా అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తారు. అనంతరం పవన్ ఇచ్చే దిశా నిర్దేశం మేరకు త్వరలోనే హైదరాబాద్ వేదికగా భారీ ఎత్తున చేరికల కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించనున్నారు.

## శివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే

### పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. జిన్నారం మున్సిపల్ చైర్మన్ నక్కిర్తి జనార్ధన్




**జిన్నారం మున్సిపల్:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సౌజన్యంతో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ నక్కిర్తి జనార్ధన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలల్లో అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడు తోందన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకా శాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. న్యూ ల్యాండ్ పరిశ్రమ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వందేటి ప్రతాపరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిన్నారం జి. వెంకటేశం గౌడ్, న్యూ ల్యాండ్ పరిశ్రమ హెచ్ఆర్ డి వి రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, విద్యాధికారి, జిల్లా యువజన సంఘాల ఉపాధ్యక్షులు ఆది రామకృష్ణ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ నేతలు కుల రాజకీయాలు మానుకోవాలి-మేడిశెట్టి బాబీ

### ప్రజల మద్దతు తట్టుకోలేకనే వైసీపీ కుట్రలు

### పవన్ కళ్యాణ్‌ను కులానికి పరిమితం చేయడం సరికాదులి

### వైసీపీ అహంకార ధోరణి మార్చుకోవాలి

### విద్వేష రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలి

### ఎన్నికల తీర్పు నుంచి వైసీపీ గుణపాఠం నేర్చుకోవాలి

### కత్తిపూడిలో జనసేన నేతల విమర్శలు




రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు జనసేన పార్టీ అధ్యక్షుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబి తీవ్రంగా మండిపడ్డారు.కత్తిపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆదరణ రోజురోజుకూ పెరుగుతున్న కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక వైసీపీ నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన వారు కుల రాజకీయాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం దురదృష్టకరమన్నారు.పవన్ కళ్యాణ్‌ను ఒక కులానికి పరిమితం చేసే ప్రయత్నాలను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు.పవన్ కళ్యాణ్ అన్ని వర్గాల ప్రజల కోసం పోరాడే నాయకుడని,ఆయనపై చేసే వ్యక్తిగత విమర్శలను ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు.సమాజంలో విభేదాలు సృష్టించి రాజకీయంగా మనుగడ సాగించాలనే వైసీపీ ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని అన్నారు.గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు నుంచి వైసీపీ ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని,ఇదే అహంకార ధోరణి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా గెలుచుకోవడం కష్టమవుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం,లింగంపర్తి సొసైటీ చైర్మన్లు దాసం శేషారావు,పెంటకోట మోహన్, తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, శంఖవరం మండల జనసేన అధ్యక్ష,ఉపాధ్యక్షులు,గాబు సుభాష్,తలపంటి బుజ్జి, ప్రత్తిపాడు మండల జనసేన అధ్యక్షుడు రామకుర్తి కామేష్,తలపంటి బుజ్జి, నాయకులు బంక కోదండరాం,సయ్యద్ గఫూర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేక వైసీపీ నాయకులు కులాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్ర ప్రజలు అభివృద్ధి,సంక్షేమాన్ని కోరుకుంటున్నారని,విద్వేష రాజకీయాలను కాదని అన్నారు.కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజల ఐక్యత కోసం జనసేన పనిచేస్తోందని,సమాజాన్ని విభజించే రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గంగిరెడ్ల మణికంఠ,ఆకుల నాని,దలే జ్యోతి,పిల్లా పద్మరాజు,తుమ్మల సత్యేంద్ర,మాగాపు వీరబాబు,కీర్తి కుమార్,తంతపురెడ్డి జయగంట,సర్నం జయబాబు,కోన సతీష్, కుండల సాయి,సైతిన సాయి,పిల్లి దుర్గ, గౌతు బుజ్జి,దొడ్డి శ్రీను,కర్రి వీరబాబు, మట్టపర్తి గణేష్,సాల వీరబాబు,వజ్రపు శ్రీనుబాబు, ఎజ్జు బుజ్జి,తేజ,పోసిన శ్రీను, కోటి తదితరులు పాల్గొన్నారు.

## జొన్నగిరిలో స్వర్ణ కాంతులు...

### దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గనిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

### కర్నూలు జిల్లా జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గని ప్రారంభం

### ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవం

### ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి లక్ష్యంగా కార్యకలాపాలు

### ఈ గని ద్వారా రాష్ట్రానికి రాయల్టీ రూపంలో ఏటా రూ.144 కోట్ల వరకు ఆదాయం

### ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 600 మందికి ఉపాధి అవకాశాలు



ఆంధ్రప్రదేశ్‌లో నూతన స్వర్ణయుగం ఆవిష్కృతమైంది. కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గనిని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం రావడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (+మీ×) సుమారు రూ. 405 కోట్ల పెట్టుబడితో ఈ గనిని అభివృద్ధి చేసింది. 70 ఏళ్ల తర్వాత భారతదేశంలో సమీకృత ప్రాసెసింగ్ యూనిట్‌తో ఏర్పాటైన తొలి ప్రైవేట్ బంగారు గని ఇదే కావడం గమనార్హం. జొన్నగిరి, ఎర్రగుడి, పగిదిరాయ్ గ్రామాల పరిధిలో 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ ఓపెన్-పిట్ గని విస్తరించి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026-27) ఈ గని నుంచి సుమారు 400 కిలోల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రానున్న కాలంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా ఒక టన్ను (1000 కిలోలు)కు పెంచనున్నారు. ఇక్కడ మొత్తం 12 టన్నుల బంగారు నిక్షేపాలు ఉన్నాయని అంచనా. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 300, పరోక్షంగా మరో 300 మందికి ఉపాధి లభించనుంది.ఈ గని కార్యకలాపాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో భారీ ఆదాయం అందనుంది. తొలి ఏడాది సుమారు రూ. 57 కోట్లు, పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభమయ్యాక ఏటా రూ. 144 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా. ఈ ఆదాయంతో పాటు డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ద్వారా స్థానిక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌లో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జొన్నగిరి ప్రాంతానికి 'స్వర్ణగిరి' అని పేరు మార్చాలనే ప్రతిపాదన కూడా ఉంది.భారత్ ఏటా భారీగా బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు జొన్నగిరి గని ఒక చిన్న ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. హంద్రీనీవా కాలువ నుంచి 18 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా నీటిని సేకరించి, ఇక్కడే బంగారాన్ని శుద్ధి చేసి బంగారు కడ్డీల రూపంలో రిఫైనరీలకు పంపనున్నారు. కేంద్ర ప్రభుత్వ మైనింగ్ సంస్కరణల ఫలితంగా ఈ ప్రాజెక్టు సాకారమైంది.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/